క్లుప్తంగా

నేడు ప్రజలతో ఎమ్మెల్యే ముఖాముఖి

నకిరేకల్ : ప్రజా పాలనకు వంద రోజులు.. ప్రజా నాయకుడికి 100 ప్రశ్నల పేరుతో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం బుధవారం ఉదయం 8 గంటలకు నకిరేకల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి 100 రోజులు పూర్తయినందున నిర్వహించే ముఖాముఖిలో ప్రజలు అడిగే ప్రశ్నలకు ఎమ్మెల్యే సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

25న జై స్వరాజ్ పార్టీ అభ్యర్థుల ప్రకటన

చిట్యాల: ఈ నెల 25వ తేదీన జై స్వరాజ్ పార్టీ తరఫున లోక్ సభకు పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించనున్నట్లు జై స్వరాజ్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పురం సంతోష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గ స్థానాల్లో జై స్వరాజ్ పార్టీ అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని జీకే అన్నారంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, వైద్యులు తిరుమల్, భాస్కర్, పద్మ, కరీముల్లా, లీనా, మాధురి, ప్రజ్వల, పాలడుగు నాగార్జున, కొండా అనురాధ, కొండ వెంకన్న, రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కోడె మృతి

శాలిగౌరారం: మేత మేసుకుంటూ వెళ్లి తెగిపడిన విద్యుత్ తీగ తగిలి కోడె మృతిచెందిన సంఘటన భైరవునిబండ గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు కోసల శంకరయ్య తనకున్న రెండు కోడెలను వ్యవసాయ పొలంవద్ద ఉన్న బీడు భూముల్లో మేపుతున్నాడు. ఈక్రమంలో ఒక కోడె మేత మేసుకుంటూ వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన కోడె విలువ సుమారు రూ.80 వేలకు పైగా ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

నూరుశాతం హాజరు

మునుగోడు: పదో తరగతి హిందీ పరీక్ష మంగళవారం నిర్వహించగా మండలంలో మొత్తం 446 మంది విద్యార్థులకు అందరు విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను స్థానిక తహసీల్దార్, ఎస్‌ఐ పరిశీలించారు.

వాహనాల తనిఖీ



బస్సులో ప్రయాణికులను తనిఖీ చేస్తున్న అధికారులు, పోలీసులు

మునుగోడు: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా భారీగా నగదు రవాణా చేయకుండా అడ్డుకునేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఎవరైనా రూ.50వేలకు మించి తీసుకెళ్తే ఆ డబ్బులు సీజ్ చేస్తామని మునుగోడు ఎస్‌ఐ సీ.హెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గూడపూర్ గ్రామం వద్ద ఏర్పాటుచేసిన చెక్ పోస్టు సమీపంలో పలు వాహనాలను నిలిపి రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఏదైనా వస్తువులు, ఇతర సామగ్రి రవాణా చేసినా ఆ వాహనంతోపాటు వస్తువులను సీజ్‌చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులతో యాదయ్య, తదితరులు

నాంపల్లి : మండలంలోని చిట్టెంపాడు గ్రామంలో మంగళవారం గ్రామానికి చెందిన అమరవాది యాదయ్య రూ.15 వేల విలువ గల క్రీడా దుస్తులను 24 మంది క్రికెట్ క్రీడాకారులకు అందజేశారు. రాజు, కృష్ణ, శ్రీను, సత్తి, సైదులు, శ్రవణ్, అంబేద్కర్, రమేష్, శరత్, చంటి, కిరణ్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

శాలిగౌరారం: పార్లమెంట్ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం రాత్రి ఊట్కూరులో బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. బెల్టు దుకాణం నడుపుతున్న బొడ్డు సతీష్ ఇంట్లో సోదాలు చేయగా తొమ్మిది బీర్లు లభ్యమయ్యాయని ఎస్‌ఐ తెలిపారు. బెల్టుషాపు నడుపుతున్న సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

శంకుస్థాపనలకే పరిమితమా !

- అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభివృద్ధి పనులకు శిలాఫలకాలు
- నేటికీ ప్రారంభం కాని పనులు
- తీవ్ర నిరాశలో కట్టంగూర్ మండల ప్రజలు

కట్టంగూర్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆశపడ్డారు. కానీ అప్పటి ప్రభుత్వం పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్నా పనులు పూర్తిచేయకుండా కాలం గడుపుతూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరుగుతాయనగా అప్పటి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హడావిడిగా కట్టంగూర్ మండలంలో పలు గ్రామాల్లో రోడ్ల పనులకు శంకుస్థాప చేశారు. కానీ పనులు నేటికీ ఏ ఒక్క గ్రామంలో కూడా చేపట్టలేదు. కేవలం అవి శంకుస్థాపనలకే పరిమితయ్యాయి.

రూ.12,81,50,000 కోట్లు మంజూరు

కట్టంగూర్ మండల పరిధిలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎన్నిలకు రెండు నెలలు ముందు గత ప్రభుత్వం రూ.12,81,50,000 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిధులతో పిట్టంపల్లి గ్రామంలో పిట్టంపల్లి నుంచి బాదెగూడెం వరకు రూ.33.50 లక్షలతో బీటీ రోడ్డు, పామనగుండ్ల గ్రామంలో రూ.20 లక్షలతో ఆరోగ్య ఉప కేంద్రం భవనం, ఎరసానిగూడెంలో రూ.90లక్షలతో బీటీ మరమ్మతులు, రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, పరడ గ్రామంలో పరడ నుంచి ఏపీ లింగోటం వరకు బీటీ రోడ్డుకు రూ.3.5 కోట్లతో, కట్టంగూర్ జీపీ సమీపంలో, హైస్కూల్ సమీపంలో పెద్ద వాగుపై రూ.4కోట్లతో రెండు బ్రిడ్జిలు, మండలకేంద్రంలో అయ్యప్పగుడి వీధిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డుకు, మల్లారం గ్రామంలో మల్లారం నుంచి అయిటిపాముల వరకు రూ.3 కోట్లతో బీటీ రోడ్డుకు, కురుమర్తి గ్రామంలోని మార్కెట్ స్థలంలో రూ.68 లక్షలతో పలు అభివృద్ధి పనులకు అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన పనులకు నేటికీ అగ్రిమెంట్, టెండర్లు వేయకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.



కట్టంగూర్‌లోని పెద్దవాగు వద్ద వేసిన శిలాఫలకం

ఆగమేఘాల మీద శంకుస్థాపనలు

కట్టంగూర్ మండలంతోపాటు పలు గ్రామాల్లో రూ.5లక్షల నుంచి రూ.20 లక్షల లోపు నిధులతో పనులు చేసేందుకు మొత్తం 53 పనులకు శంకుస్థాపనలు చేశారు. వాటిలో 29 పనులు పూర్తి కాగా నేటికీ 24 పనులు నిధుల కొరతతో ప్రారంభించలేదు. ప్రారంభించిన పనులకు సుమారు రూ.1.15 కోట్ల నిధులు అవసరం ఉండగా అగ్రిమెంట్ కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మండలకేంద్రంలో రూ.20లక్షలతో శ్రీలక్ష్మినారాయణ ఆలయం, కట్టంగూర్‌లో గౌడ సంఘం నిర్మాణానికి రూ.15లక్షలు, పరడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, బొస్కర్లబాయి గ్రామంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీకి రూ.10లక్షలు, పిట్టంపల్లిలో సీసీ రోడ్డు, డ్రైనేజీలకు రూ.10లక్షలు, కురుమర్తిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు రూ.10లక్షలు, పందెనపల్లిలో సీసీ రోడ్డు, డ్రెయినేజీలకు రూ.10లక్షలు, ఎరసానిగూడెంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీకి రూ.10 లక్షలు, నల్లకుంటబోలులో సీసీ, డ్రెయినేజీలకు రూ.5లక్షలు, పామనగుండ్లలో సీసీ, డ్రైనేజీలకు రూ.10 లక్షలు, కల్మెరలో సీసీ రోడ్డు, డ్రెయినేజీలకు రూ.10లక్షలు, రామచంద్రాపురంలో సీసీ, డ్రెయినేజీలు రూ.10లక్షలతో నిర్మించేందుకు శంకుస్థాపన చేసినా నిధుల కొరతతో నేటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని శంకుస్థాపన చేసిన పనులకు నిధులు కేటాయించి పనులు వెంటనే ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి పనులు ప్రారంభించాలి

మండల కేంద్రంలోని పెద్ద వాగుపై రూ.4 కోట్లతో రెండు బ్రిడ్జిలను నిర్మించేందుకు ఎన్నికల ముందు అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి నిధులు మంజూరు చేసి బ్రిడ్జి పనులు ప్రారంభించాలి.

–మేడి రాంబాబు, అంబేద్కర్‌నగర్, కట్టంగూర్



ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం

గత ప్రభుత్వంలో ఎన్నికల ముందు శంకుస్థాపన చేసిన పనులకు నిధులు లేకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో అగ్రిమెంట్లు, టెండర్లు పిలువలేదు. పంచాయతీ రాజ్ శాఖలో నిధులు లేకపోవడంతో ఆర్‌అండ్‌బీ ద్వారా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకొని నిధులు మంజూరు చేస్తే త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– పీఆర్ ఏఈ జమీల్ అహ్మద్, కట్టంగూర్

ప్రజలంతా బీజేపీకి మద్దతు ఇవ్వాలి

- భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్

చిట్యాల: దేశాభివృద్ధి, మెరుగైన పాలన అందాలంటే మూడోమారు బీజేపీకి ప్రజలంతా మద్దతుగా నిలవాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. చిట్యాలలో మంగళవారం బీజేపీ కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ముందుగా అంబేద్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ బత్తుల కళావతిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్, పొట్లపల్లి నర్సింహ, కాటం సందీప్, హరీశ్, గుండాల నరేష్, కన్నెబోయిన మహాలింగం, చిట్యాల పట్టణ అధ్యక్షుడు కూరెళ్ళ శ్రీను, ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరిక

నార్కట్‌పల్లి : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నారని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తలు, వార్డు సభ్యులు సుమారు వంద మంది బూర నర్సయ్య గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి పాలన సాగించిన బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో కాలం చెల్లిందన్నారు. పదేళ్ల రాచరిక పాలన నుంచి ప్రజలు విముక్తి పొందారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు తప్పుడు వాగ్దానాలను చేసి అధికారంలోకి వచ్చిందని, వంద రోజులు అవుతున్నా ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తిరిగి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. తనకు ఓటు వేసి పార్లమెంటుకు పంపించాలని కోరారు. బీజేపీలో చేరినవారిలో మేడబోయిన శ్రీను, వడ్డెగోని రాజు, రాగిరి శివశంకర్, ఎం.శేఖర్, రామలింగం, శివరాం, నవీన్‌రెడ్డి, నవీన్, రాజు, శివకుమార్ ఉన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, నియోజకవర్గ కన్వీనర్ నర్సింహ, శ్రవణ్‌కుమార్, గణేశ్, శ్రీనివాస్, వీరయ్య, భాస్కర్‌రావు, రమేష్, రవి, పరమేష్, రమేష్ పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : బీజేపీలోకి ఆహ్వానిస్తున్న బూర నర్సయ్య గౌడ్

కనులపండువగా కల్యాణ మహోత్సవం



కనగల్ : ఆలయంలో పూజలు చేస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్



చిట్యాల: పెద్దకాపర్తిలో ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



మునుగోడు : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మునుగోడు: మండలంలోని కిష్టాపురం గ్రామం వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం వేణుగోపాలస్వామి రుక్మిణిసత్యభామల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై దేవతలకు వడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన దేవిరెడ్డి సతీష్ రెడ్డి అన్నదానం ఏర్పాటుచేశారు. వేడుకల్లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చౌటుప్పల్ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.నరేందర్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, మాజీ జెడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో శ్రీ తిరుమలనాథ స్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు అందంగా ముస్తాబు చేసి వేద మంత్రాలతో అర్చకులు కల్యాణం జరిపించారు. వేడుకల్లో భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు, గ్రామస్తులకు నిర్వహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

కనగల్: మండల పరిధిలోని రేగట్టె గ్రామంలో శ్రీ భవాని శంకరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఆలయ కమిటీ సభ్యులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. భక్తులు ఒడిబియ్యం పోసి కట్నాలు సమర్పించారు. మంగళవారం విఘ్నేశ్వర పూజ, స్వామి వారి ఊరేగింపు, రథోత్సవం, ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకలకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. 21న అగ్నిగుండాలు శివసత్తులతో పూజలు, కళాకారులతో భాగవత నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకల్లో ఎంపీటీసీ పాలకూరి పుష్పలత వెంకటేశం, మాజీ జెడ్పీటీసీ ఎర్రోల్ల సంజీవ, మాజీ వైస్ ఎంపీపీ భారత వెంకటేశం, మాజీ సర్పంచ్ కడారి కృష్ణయ్య, ఆలయ చైర్మన్ గంజి చంద్రమౌళి, దొమ్మాటి అంజయ్య, కర్నాటి శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, ఎర్రోల్ల ఎల్లయ్య, నాగరాజు, శ్రీను, రావుల వెంకన్న, సురేష్ పాల్గొన్నారు.

'పంచాయతీ కార్యదర్శి లేక ఇబ్బందులు పడుతున్నాం'

కనగల్ : పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు అమ్మగూడెం గ్రామ పంచాయతీకి నూతన సెక్రటరీ బాధ్యతలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు కొండ ఏడుకొండలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండాకాలం కావడంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ అధికారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గండమల్ల కోటేష్, కట్ట కోటిరెడ్డి, మాచర్ల శ్రీను, గోగు శేఖర్, కొండ సైదులు తదితరులు ఉన్నారు. ఈ విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా సదరు పంచాయతీ కార్యదర్శి మంగళవారం సాయంత్రం సెలవులు కావాలని లెటర్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామానికి ఇన్‌చార్జ్ కార్యదర్శిని నియమిస్తామని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామగిరి(నల్లగొండ): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై మంగళవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం శేరిలింగోటం గ్రామానికి చెందిన నర్సింగ్ శంకర్, నర్సింగ్ శ్రీకాంత్, సాయిలు ఇసుక ట్రాక్టర్లు నడుపుతూ శేలి లింగోటం ఇసుక రీచ్ నుంచి నల్లగొండకు ఇసుక బుక్ చేశారు. అధిక డబ్బులకు ఆశపడి లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేయకుండా తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లికి ఇసుక తరలిస్తుండగా పోలీసులు వారి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఏఎస్‌ఐ రామ్మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కట్టంగూర్ : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి



చండూరు: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ



మునుగోడు :ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



మర్రిగూడ: పోషణ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ యశోద

కట్టంగూర్ : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని దుగినవెల్లి, ముత్యాలమ్మగూడెం, ఎరసానిగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాలు, మిల్లెట్స్, పోషకాహారం, ఆరోగ్యంపై గర్భిణులకు, బాలింతలకు ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడబ్ల్యూటీఎస్ వాణీ, బి ఉప్పలమ్మ, ఎన్ జ్యోతి, కే నవనీత, వి కళమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

చండూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ కోరారు. మంగళవారం మండల పరిధిలోని అంతంపేట, దేవులతండా గ్రామాల్లో నిర్వహించిన పోషక పక్వాడ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిరుధాన్యాలు పప్పులు, ఆకుకూరలు ప్రతిరోజు తీసుకుంటే ఎంతో మంచిదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు కళమ్మ, అంబిక, యాదమ్మ, శారద, సునీత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కకీ పోషకాహారం అందించాలి

మునుగోడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పేరు నమోదైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం అందించాలని సీడీపీఓ కవిత సూచించారు. మంగళవారం మునుగోడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తోందన్నారు. మార్చి 1వ తేదీ నుంచి ఇంటింటి సర్వే చేపట్టి ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో నమోదు చేయాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

మర్రిగూడ: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద అన్నారు. మంగళవారం మండల కేంద్రం పరిధిలోని తూర్పుతండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు వి.లక్ష్మీ, శోభారాణి, ఆశాలు, తల్లులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

చండూరు: జేడీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చండూరు మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన కాళోజి లైబ్రరీని ఫౌండేషన్ అధ్యక్షుడు వి.వి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఫౌండేషన్ ఇన్‌చార్జ్ కవిత, సభ్యురాలు అపర్ణ లైబ్రరీ ఇన్‌చార్జ్ మాదగోని నాగార్జున, మాజీ సర్పంచ్ బోయపల్లి భిక్షమయ్య, జంగయ్య, కర్నాటి వెంకటేశం, ఇరిగి రజనీకాంత్, సుంకరి తరుణ్, బోయపల్లి శ్రీకాంత్, కాటేపల్లి రాణాప్రతాప్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

శాలిగౌరారం: మండలంలోని రామాంజాపురం, చిత్తలూరు, వంగమర్తి గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలువురు కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల కుటుంబాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం పరామర్శించారు. రామాంజాపురం గ్రామంలో ఇటీవల మృతిచెందిన బత్తిని అబ్బయ్య, చిత్తలూరులో మద్ది మల్లమ్మ, ఎర్ర గణేశ్, వంగమర్తిలో గడ్డిపర్తి నతానియేల్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, శంకర్‌రెడ్డి, బొమ్మగాని రవి, చైతన్యరాజు, కృష్ణమోహన్, మల్లేష్, చంద్రారెడ్డి, రామనర్సయ్య, మల్లయ్య, మల్లయ్య, గోపీనాథ్, వెంకటేశ్, శ్రీను, గంగయ్య ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

చందంపల్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం



ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నకిరేకల్ : చందంపల్లి గ్రామంలో నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం వివిధ కార్యక్రమాలు చేపట్టారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగు, వీధుల్లో కంప చెట్లను తొలగించారు. పరిసరాల ప్రాముఖ్యతపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్‌కె అబీబ్‌జానీ, అధ్యాపకులు కె.హరిత, మధుసూదన్‌రెడ్డి, జానయ్య, శంకర్, సురేష్, సురేందర్, శ్రీనివాస్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వంటల పోటీలు

నల్లగొండ : పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం భారత ఆహార సంస్థ ఆధ్వర్యంలో ఎఫ్‌సీఐ డివిజన్ కార్యాలయంలో వంటల పోటీలు నిర్వహించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. పోషణ పక్షోత్సవాలు ఈ నెల 23 వరకు జరగనున్నాయి. కార్యక్రమంలో డీఎం సుశీల్‌కుమార్‌సింగ్, ఏజీఎం రతీష్‌చంద్రన్, రఘుపతి, కేఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికే ఆదర్శమూర్తి మల్లు స్వరాజ్యం



నల్లగొండ టౌన్ : మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేస్తున్న చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



నకిరేకల్: మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : మల్లు స్వరాజ్యం ప్రపంచానికే ఆదర్శమూర్తి అని నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం మల్లు స్వరాజ్యం వర్ధంతిని దేవరకొండ రోడ్డులోని సత్యవతి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎంవీఎస్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి మల్లు స్వరాజ్యం అని అన్నారు. మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా సత్యవతి ఆస్పత్రిలో ఉచితంగా మోకాళ్ల చిప్ప మార్పిడి ఆపరేషన్ నిర్వహించిన డాక్టర్ మల్లు అరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రాంమోహన్ బృందాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంవీఎస్ విజ్ఞాన్ కేంద్రం కన్వీనర్, సత్యవతి, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకుడు డా.మనోహర్, పి. నర్సిరెడ్డి, సత్యనారాయణ, డా.చైతన్య, శంకర్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ పూలమాల వేసి నివాళులర్పించారు. జె.ఉమ, బి.ఇందిర, పి.పద్మావతి, గోవిందమ్మ, యాదమ్మ, అలివేలు, నవీన, రేణుక, పద్మ, మమత, లక్ష్మమ్మ, రాణి, రజని, జమున పాల్గొన్నారు.

నకిరేకల్ : సీపీఎం ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని నకిరేకల్‌లో మంగళవారం నిర్వహించారు. మల్లు స్వరాజ్యం చిత్రపటానికి సీపీఎం జిల్లా నాయకురాలు కందాల ప్రమీలా పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు, నాయకులు మర్రి వెంకటయ్య, సాకుంట్ల నర్సింహ, నాగమణి, వంటెపాక కృష్ణ, పరమేష్, లగిశెట్టి శ్రీను, బుచ్చిరాములు, శశికళ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని మంగళవారం కేతేపల్లిలో సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.లూర్థుమారయ్య, నాయకులు చొగోని నాగయ్య, కోదాటి రవితేజ, నాగమళ్ల వెంకన్న, జ్యోతి, సొనమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం చిట్యాల, ఉరుమడ్ల గ్రామాల్లో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, జిట్టా సరోజ, అవిశెట్టి శంకరయ్య నాయకులు ఐతరాజు నర్సింహ, శీలా రాజయ్య, కత్తుల లింగస్వామి, కల్లూరి కుమారస్వామి, మేడి సుగుణమ్మ, బెలిజ మల్లయ్య, కురుపటి లింగయ్య, పోలగోని శ్రీశైలం, గుడిసె లక్ష్మీనారాయణ, బొబ్బలి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మునుగోడు: మల్లు స్వరాజ్యం వర్ధంతిని మునుగోడులోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మతోన్మాదన్ని పెంచి పోషిస్తున్న బీజేపీని త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఎంలో కొనసాగుతున్న మునుగోడు మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని, అందుకు ఆయన పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం, మండల కార్యదర్శి మిర్యాల భరత్‌కుమార్, సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు, యాసరాని శ్రీను, వేముల లింగస్వామి, యాట యాదయ్య, సాగర్ల మల్లేష్, కొంక రాజయ్య, రాములు పాల్గొన్నారు.



చిట్యాలలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నాంపల్లి : మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం మండల పార్టీ కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, లక్ష్మయ్య, కొమ్ము లక్ష్మయ్య, శ్రీకాంత్ తదితరులున్నారు.

మర్రిగూడ: మల్లు స్వరాజ్యం వర్ధంతిని మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, ఎడ్ల నరసింహ, రాజునాయక్, మల్లేష్, వెంకటయ్య, రాజు పాల్గొన్నారు.